క్లుప్తంగా

ఎంపీ కలిశెట్టికి అభినందనలు



ఎంపీ కలిశెట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని రణస్థలంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎం.శ్రీనివాసరావు సోమవారం కలిశారు. విజయనగరం జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా ఎంపీ ఎంపికవ్వడంతో ఆయనను అభినందించారు. వర్సిటీ ప్రగతికి నిధులు మంజూరు చేయాలని, క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. వర్సిటీలో క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేరల్స్ నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలుచోట్ల క్రిస్మస్ వేడుకలు, కేరల్స్ ఘనంగా సోమవారం నిర్వహించారు. స్థానిక చిన్నబజారులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చిలో మహిళా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా క్రీస్తు ఆరాధన గీతాలు, నృత్యాలు, కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీసులు చేపట్టారు.

సెయింట్ థామస్ చర్చిలో...

టౌన్‌హాల్ రోడ్డులో ఉన్న సెయింట్ థామస్ చర్చి ఫాదర్ బోనెల రాజు ఆధ్వర్యంలో కేరల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి క్రీస్తు సందేశాన్ని తెలిపి క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం అందించారు.

క్రీడాకారులు జిల్లాకే గర్వకారణం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ బాక్సింగ్ క్రీడాకారులు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారని డీఎస్‌డీవో డా.కె.శ్రీధర్‌రావు కొనియాడారు. ఇటీవల పిఠాపురంలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం కోడిరామ్మూర్తి మైదాన ప్రాంతంలో ఆయన అభినందించారు. వీరిని తీర్చిదిద్దుతున్న కోచ్ ఉమామహేశ్వరరావు సేవలను ప్రశంసించారు.

పరామర్శ



ఆదినారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలో రణస్థలం పంచాయతీలోని నగరపాలెం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కెల్ల ఆదినారాయణ తండ్రి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు చినరామినాయుడు, కరిమజ్జి రమణ, కరిమజ్జి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ప్రకృతి రైతులకు సత్కారం



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని సీనియర్ డాక్టర్ కె.అమ్మన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రపంచ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్న పలువురు రైతులను దుశ్శాలువతో సత్కరించిన జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌బీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు డైరెక్టర్ రేవతి, వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానిశంకర్, వ్యవసాయ విభాగం రాష్ట్ర టీచర్ కో–ఆర్డినేటర్ దార్లపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురం గ్రామ పరిధిలో ఉన్న సైకి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం కొయ్యాం పంచాయతీ కేకే నాయుడుపేటలో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరంలో భాగంగా పశువైద్య శిబిరం నిర్వహించి, పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బి.వెంకటేష్, ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ శ్రావణి, ఎన్‌ఎస్ఎస్ పీవో అనసూయమ్మ పాల్గొన్నారు.

జీతాలు మహాప్రభో..!

- 6 నెలలుగా ఆయాల ఎదురుచూపులు
- జీతాలకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు
- పాఠశాలల నిర్వహణ అగమ్యగోచరం



పాతర్లపల్లి హైస్కూల్ మురుగుదొడ్డి



నీటి సరఫరా లేని పైడిభీమవరం టాయిలెట్

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో వందలాదిమంది విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం వాటిల్లకుండా నిత్యం తమ సొంత పిల్లలు వలే చూసుకుంటూ, మరుగుదొడ్లు శుభ్రపరిచే ఆయాల ఆర్థిక పరిస్థితి కూటమి ప్రభుత్వంలో దయనీయంగా మారింది. గత ప్రభుత్వంలో నాడు–నేడు పనుల్లో భాగంగా రూ.లక్షలు వెచ్చించి అధునాతన పరికరాలు, నీటి సరఫరా పైపులైన్లు పెట్టి ప్రభుత్వ పాఠశాలల మరుగుదొడ్లు తీర్చిదిద్దారు. వీటి నిర్వహణ చూసేలా ప్రతీ పాఠశాలకు విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ఇద్దరు, ముగ్గురు స్వచ్ఛ దూత్(ఆయా)లను నియమించారు. వారు రోజూ మరుగుదొడ్లను పరిశుభ్రం చేస్తుంటారు. అయితే వారికి గత ఆర్నెళ్లుగా జీతాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా పాఠశాలలకు రక్షణగా నిలిచే నైట్ వాచ్‌మెన్ల జీతాలు సైతం పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు.

నియోజకవర్గంలో..

రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం నాలుగు మండలాల్లోనూ కలిపి 25,807 మంది విద్యార్థులు ఉన్నారు. లావేరు మండలంలోని 85 పాఠశాలల్లో 5,216 మంది, జి.సిగడాంలోని 63 పాఠశాలల్లో 4,900 మంది, రణస్థలంలోని 108 పాఠశాలల్లో 7,650 మంది, ఎచ్చెర్ల మండలంలోని 106 పాఠశాలల్లో 8,041 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ మొత్తంగా 282 పాఠశాలల్లో వాచ్‌మెన్లు, ఆయాలు కలిపి 343 మందికిపైగా ఉన్నారు. సుమారు మూడు వందల మంది విద్యార్థులకు ఒక ఆయా (స్వచ్ఛదూత్) చొప్పున నియమించారు. మరుగుదొడ్లు లేని కొన్ని పాఠశాలలకు ఆయాలు నియమించలేదు. అలాగే అన్నీ హైస్కూల్లో నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా జీతాలు వచ్చేవని ఆయాలు చెబుతున్నారు. కానీ ఈ ప్రభుత్వంలో ఒక్క నెల కూడా జీతాలు వేయలేదని, అలా అని పని మానేస్తే పాఠశాలలో చదివే పిల్లలు ఇబ్బందులు పడతారని తప్పక చేస్తున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల బాగోగులు చూసే అయాలపై చిన్నచూపు చూపడం తగునా అని ప్రశ్నిస్తున్నారు. ఫినాయిల్, బ్లీచింగ్, నీటి సరఫరా పరిస్థితి పట్టించుకోవడమే మానేశారని వాపోతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు



గత ఆరు మాసాలుగా మాకు జీతాలు లేకపోయినా ఆర్థిక ఇబ్బందులతో పని చేస్తున్నాం. ఎందుకంటే ఈ పాఠశాలల్లో చదివే పిల్లలు మా సొంత పిల్లలే కదా. మేము మానేస్తే మరుగుదొడ్లు అధ్వానంగా మారి మా పిల్లలు అనారోగ్యం పాలవుతారు. మా ఆవేదనను ఆ దేవుడే వినాలి. ఉపాధ్యాయులకు రోజూ చెబుతున్నా. అదిగో ఇదిగో అంటున్నారే తప్పా జీతాలు రావడం లేదు.

– చోదవరపు సూరమ్మ,
ఆయా, పాతర్లపల్లి హైస్కూల్, రణస్థలం

బకెట్లతో నీరు తెస్తున్నాం



మాకు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామనే బాధ ఒకవైపు, మా హైస్కూల్లో మరుగుదొడ్లుకు నీటి సరఫరా లేకపోవడం మరోవైపు ఉంది. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రోజూ బకెట్లతో నీరు తెచ్చి శుభ్రం చేస్తున్నాం. గతంలో ఎంతో చక్కగా ఉండేది. మా బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారు. అర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. మా జీతాలు త్వరగా వేయాలని కోరుతున్నాం

– రాములమ్మ,
ఆయా, పైడిభీమవరం హైస్కూల్

బిల్లులు పెట్టాం



బడ్జెట్‌లో స్వచ్ఛ దూత్‌లు, నైట్ వాచ్‌మెన్లకు బిల్లులు పెట్టాం. ఇంకా రిలీజ్ కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. మరో వారం రోజుల్లో వచ్చేలా చూస్తాం.

– ఎ.త్రినాథరావు,
ఎంఈవో, రణస్థలం

'రాజ్యాంగంపై పథకం ప్రకారం దాడి'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాజ్యాంగంపై పథకం ప్రకారం దాడి జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకిక, సామ్యవాద, సమానత్వ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వీటన్నింటినీ కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని బలవంతంగా దేశ ప్రజలపై రుద్దాలనే దురుద్దేశంతో, రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడుతుంటే అతనిపై తప్పుడు కేసులు బనాయించి ఒక కొత్త సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స వెంకట రమణ, నరసన్నపేట నియోజకవర్గం ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, పాతపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి మజ్జి మురళీమోహన్, ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఆబోతుల వెంకట నాయుడు, నాయకులు పూడి కిరణ్ కుమార్, అంబటి దాలినాయుడు, ఇజ్జురోతు రమణ, గొల్లపల్లి దాలయ్య, జి.అప్పారావు, కొత్తకోట జోగినాయుడు, చాన్ భాష, సయ్యద్ ఉల్లా ఖాన్, కనుగుల రవికుమార్, రావాడ సుదర్శన్‌రావు, అంబటి రాజారావు, సతివాడ ధర్మారావు, సతివాడ ధర్మారావు, సురియాబేగం, సోడవరం లీలావతి, బేరి వెంకటరావు, అంబటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళం నగరంలోని బొంతావారి వీధిలో నివాసముంటున్న అంధవరపు లక్ష్మణమ్మ(81) బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఆకస్మికంగా మృతి చెందారు. కాగా మరణాంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో మేనల్లుడు వారణాసి మాధవరావు, వంశీలు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియచేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యుడు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

ఘనంగా అనఘాష్టమి పూజలు



అనఘాష్టమి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తబ్రిడ్జి వద్ద నున్న పాజుల్‌భాగ్‌పేటలోని చిందత్తనాథక్షేత్రంలో అనఘాష్టమి వ్రతాలు సోమవారం జరిగాయి. అర్చకులు సింహాచలశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు, మాతృశ్రీ మండలి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో అనారోగ్యం



మాట్లాడుతున్న ఐజీడీ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం ఉన్నత పాఠశాలలో ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డవలప్‌మెంట్ సభ్యులు అయోడిన్ లోపంపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీడీ జిల్లా కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు మండలాల్లోని 40 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని, ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆర్థిక సాయంతో చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరించారు. రీసోర్స్ పర్సన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అయోడిన్ తీసుకోకపోతే డ్రెస్కిన్, ఎదుగుదలలో లోపం, థైరాయిడ్, బలహీనత, రక్తహీనత ఏర్పడతాయన్నారు. దీన్ని నిర్మూలించడానికి అయోడైజెడ్ సాల్ట్‌ను మాత్రమే వాడాలన్నారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్డు, డ్రైఫ్రూట్స్ తగు మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యంపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ ప్రెసిడెంట్ సుమతి, విజయనగరం జిల్లా కో–ఆర్డినేటర్ అశోక్, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలభైరవునికి నారికేళ దీపాలు



నారికేళ దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల్లో అష్టమి సందర్భంగా నారికేళ దీపాలతో సోమవారం పూజలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు కొబ్బరికాయలతో దీపాలను వెలిగించి యంత్ర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి గోల్కొండ రేవు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించి రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరిగింది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎం.వరప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయం వద్ద ఫ్యాన్సీ షాపు నడుపుతున్న సుభాది, పర్విదాభేగం దంపతులు గోల్కొండ రేవు వద్ద సయ్యద్ జోషి ఇంట్లో కింద పోర్షన్‌లో అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగి చుట్టుపక్కల దట్టమైన పొగలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఇంటికి వెళ్లేమార్గం చిన్నసందులా ఉండడంతో ఇబ్బందిగా మారింది.

బెల్టు షాపులపై దాడులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు అకస్మిక దాడులు సోమవారం నిర్వహించారు. శిలగాం సింగువలస గ్రామంలో పాన్‌షాపు నిర్వహిస్తున్న జామి సతీష్‌కుమార్ మద్యం విక్రయిస్తుండుగా దాడిచేసి 7 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా చింతాడ గ్రామానికి చెందిన మన్యం అక్కులు అనేవ్యక్తి పాన్‌షాపులో మద్యం విక్రయిస్తుండుగా ఆయన వద్ద 13 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే శిలగాం సింగువలస గ్రామ సమీపంలో గొడాన్ వద్ద జామి ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.67 వేల క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. వీరందరిపై కేసులు నమోదు చేశామన్నారు.

మత సామరస్యంతో మెలగాలి



క్రిస్మస్ హైటీలో గీతాలు ఆలపిస్తున్న యువతులు



ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: అందరూ మత సామరస్యంతో మెలగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రభుత్వం తరఫున హైటీ క్రిస్టమస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధి కోసం తాము కట్టుబడి ఉన్నామన్నారు. పాస్టర్స్ కోసం జీతాలను ప్రవేశపెట్టింది తామేనని పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ చర్చిల వద్ద భద్రత, తాగునీరు, పరిశుభ్రత కోసం సంబంధిత అధికారులకు సూచనలు చేస్తామని తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి, క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, పాస్టర్లు కృపానందం, కృష్ణారావు, మైనారిటీ సంక్షేమాధికారి జాన్, పాస్టర్ బాలరాజు, సూరాడ యేకబ్, దేవదాసు డీవీబీవీ కుమార్(బోసుబాబు), ఆర్‌డీవో కె.సాయి ప్రత్యూష, కె.హరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అధ్వానం



శ్రీకాకుళం నగరంలోని చేపల మార్కెట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయమైపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మార్కెట్‌కు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉండడంతో వారంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంతలు పూడ్చి రోడ్డు బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం అర్బన్

ప్రమాదపు తీగలు



శ్రీకాకుళం నగరం నడిబొడ్డున చిన్నబరాటం వీధిలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రద్దీగా ఉన్న సమయంలో సర్వీస్ వైరు నేలపడి ఉన్నా పట్టించుకున్నవారే కరువయ్యారు. ఎవరికి వారు దాటుకుంటూ వెళ్లిపోతున్నారే తప్ప ప్రమాదాన్ని గుర్తించలేదు. కనీసం నగరపాలక అధికారులు, విద్యుత్ ఉద్యోగులు పట్టించుకోలేదు. ఇలా నగరంలో చాలా చోట్ల విద్యుత్ వైర్లు మృత్యుతీగల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఆర్థిక అక్షరాస్యత పెరగాలి



కుర్చీలు వితరణగా ఇచ్చిన యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ తిలక్ తదితరులు

శ్రీకాకుళం: విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యత పెరగాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ అన్నారు. పట్టణంలోని అంధవరపు వరహనర్సింహం మున్సిపల్ హైస్కూల్లో సోమవారం యూనియన్ బ్యాంక్ ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంత చదువుకున్నప్పటికీ ఆర్థిక అక్షరాస్యత లేకపోతే అనేక ఇబ్బందులు పడతారని, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించారు. పాఠశాలలో ఉపయోగించేందుకు వీలుగా రూ.37,500 విలువ చేసే కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో రామలక్ష్మణ శాఖ యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.ఇందిరా ప్రియదర్శిని, పాఠశాల హెచ్‌ఎం పి.ఇందిరామణి, బ్యాంక్ సిబ్బంది మురళీకృష్ణ, సంతోషి, సాయిశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పోలినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, రక్షణకు ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను పలువురు వక్తలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, సీహెచ్ రామ్మూర్తి, హెచ్.లక్ష్మీపతి, శ్రీనివాస్ పాత్రో, కె.వాసుదేవరావు, పావని, రజని, అరుణకుమారి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



సామూహిక ధ్యానంలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: సామూహిక ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ మాస్టర్లు అన్నారు. స్థానిక కోర్టు వెనుకనున్న తిరుమల కళాశాల మొదటి ఏడాది విద్యార్థులకు పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సామూహిక ధ్యాన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మ జ్ఞాన సందేశం, సామూహిక ధ్యానం వలన కలిగే లాభాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం సభ్యులు కోపూరి బిందుమాధవి, శారద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సిక్కోలు హవా



జాతీయ పోటీల్లో రాణించిన బాడీ బిల్డింగ్ క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి జూనియర్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు రాణించారు. ఈ నెల 20, 21వ తేదీలలో న్యూకుచ్ బీహార్ నార్త్‌బెంగాల్ వేదికగా జరిగిన పోటీల్లో ఎస్‌కే జాఫర్ 55 కేజీలు, పి.సతీష్ 60 కేజీల్లో మొదటిస్థానంలో నిలవగా ఎల్.దుర్గాప్రసాద్ 70కేజీలు, ఏ.రాజేష్ 55 కేజీల విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచారు. ఆర్.సాయి సిద్దు తృతీయ స్థానం, డి.గోపీచంద్, ఎస్.జయచంద్, టి.నూకరాజు మాస్టర్స్ విభాగాల్లో రాణించినట్లు ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.విజయ్‌కుమార్ తెలిపారు. వీరిని ఏపీ చైర్మన్ కెఎంవీ నాగేశ్వరరావు, ఐబీబీఎఫ్ జాతీయ రిఫరీలు కె.గురునాథ్, టి.రాములు అభినందించారు.

నిరసన వాయిదా

అరసవల్లి: 104 మొబైల్ యూనిట్ వాహన సేవలు బహిష్కరించేలా తీసుకున్న నిర్ణయాన్ని సదరు ఉద్యోగుల సంఘం తాత్కాలికంగా వాయిదా వేసింది. సమస్యల పరిష్కారం కోరుతూ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని విన్నవిస్తున్నా న్యాయం జరగకపోవడంతో ఈ నెల 23నుంచి విధుల బహిష్కరణకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తదుపరి కార్యాచరణను త్వరలో వెల్లడిస్తామన్నారు.